

# మట్టి

పులిచెర్ల సాంబశివరావు

అది, భారతదేశంలో ఒకానొక నగరంలో నడి బొడ్డులో ఉన్న నడిరోడ్డు.

కాలం, సాయంత్రం.

కాలేజీలు వదిలే కాలం.

ఆఫీసులు మూసే టయిం.

కూలిజనం కొంపలకు చేరేవేళ.

ఆ రోడ్డు షాపుకారు ఇనప్పెట్టెలాగా చాలా ఇరుగ్గా వుంది. సినీమాతార ఇంటి ముందులాగా భలే రష్‌గా వుంది. వెరైటీ సెంటర్లో సామాన్లలాగ రకరకాల మనుషులు కనబడుతున్నారు.

అప్పుడు ఆ రోడ్డుమీదికి—

ఎలా వొచ్చిందో, ఎక్కడినుంచి వచ్చిందో ఓ చిన్న కుక్కపిల్ల వచ్చింది. వయసు వారం ఉంటుందేమో. మనిషి పిల్లలకంటె ముచ్చటగానేవుంది. అందంగా వుంది. బ్రిడ్జికింద బతికే అనాథులైన పిల్లల్లాగా అది నిశ్చింతగా వుంది. కాలేజి అమ్మాయిలాగా అంత నడిబజారులోనూ ట్రాఫిక్‌ను లెక్క చెయ్యకుండా మెల్లగా నడుస్తోంది.

అది ఇప్పుడు సరిగ్గా నడిబజారులోకి వచ్చింది.

ఆ దారిన పోయేవాళ్లలో చాలామంది దాన్ని గమనించకపోలేదు.

అదిగో ఆయన కాలేజి లెక్చరరు. ఆయన అసలే దయార్ద్ర హృదయుడు. పిల్లలు గలవాడు. పెళ్ళాంతో వేగుతున్నవాడు. మీదు మిక్కిలి ఉపాధ్యాయుడు గదా! కష్టం తెలిసినవాడు. కుక్కపిల్లని చూశాడు. గుండె టక టక కొట్టుకుంది. గుండె కరిగింది. కళ్లార్పకుండా చూశాడు. బొమ్మలా కాసేపు నిలబడ్డాడు. అదిగో, ఆర్టీసి బస్సు వచ్చేస్తోంది! అరెరె! కుక్కపిల్ల నడిరోడ్డుమీద వుందే! లెక్చరర్ కాలు ముందుకు పడింది. కానీ కదల్లేదు. ఎదురుగా అవతలవైపు తన విద్యార్థి వున్నాడు. ఇటే చూస్తున్నాడు. తాను కుక్కపిల్లను పట్టుకుంటే ఇంకేమైనా వుందా! రేపు ఆ కుర్రాడు కాలేజీ అంతా టాంటాం కొట్టడూ. కాసేపు కళ్లు మూసుకున్నాడు. కళ్లు చెమ్మగిల్లినయ్. బస్సు పెద్దగ రొద చేసుకుంటూ దూసుకుపోయింది. కన్నులు తెరిచాడు. కుక్కపిల్ల నిక్షేపంగా ఉంది! ఇహ! లాభంలేదు. తాను ఇక్కడినుంచి వెళ్లిపోవాలి. ఆ కుర్రాడు కనిపెట్టేస్తున్నాడు. ఇటే చూస్తున్నాడు.

లెక్చరర్ వెళ్లిపోయాడు.

ఆ ఎదురుగా ఉన్న విద్యార్థి సంగతి చూద్దాం.

అతడు బుద్ధిమంతుడు. హృదయం ఉన్నవాడు. పిన్నవాడే! కుక్కపిల్లలంటే ప్రేమ. వాళ్లు లక్షాధికార్లు. వాళ్లింట్లో అప్పటికే ఎన్నో కుక్కలున్నాయి. అందు చేతనే ఆ అబ్బాయికి కుక్కలంటే మమకారం.

ఇతడు ఆ కుక్కపిల్లను చూశాడు. జాలి పడ్డాడు. తీసి రోడ్డవతల పెడదామనుకున్నాడు. కదలబోయాడు. కాని

ఎదురుగ్గా లెక్చరరు! ప్రతిమలా వుండి పోయాడు. అమ్మయ్యో! ఇప్పుడా కుక్క పిల్లను పట్టుకుంటే ఇంకేమైనా వుందా! రేపు లెక్చరర్ క్లాసులో ఈ సంగతి చెప్పి గాలి తీస్తే...ఇంకేమైనా వుందా! అదిగో మాష్టారు అంతా గమనించినట్టు న్నాడు. ఇహ పోవడం మంచిది.

ఆ విద్యార్థి పోయాడు.

కుక్కపిల్ల అక్కడే వుంది.

ఆ పక్కనే వో ఆఫీసరు ఇందాకటి నుంచి ఆ కుక్కపిల్లను గమనిస్తున్నాడు. ఆఫీసులో ఎంత రాక్షసుడులాగా ప్రవర్తించినా ఇంకా మానవత్వం పూర్తిగా చావ లేదు ఆయనకి పాపం. అందుకే జాలి పడ్డాడు. కుక్కపిల్లను తీసి అవతల పెట్టేవద్దామనుకున్నాడు. కాని ఎదురుంగా అవతలివైపు తన ప్యూను పోతున్నాడు. వాడుగాని చూస్తే ఇంకేట్లా. రేపు ఆ క్షర్కుగాళ్ళకు తెలిస్తే ... ఊహించలేక పోయాడు.

ఆ ప్యూను గూడా కుక్కపిల్లను చూశాడు. నిజానికి వాడి బ్రతుకు ఆ కుక్కపిల్లకంటే హీనంగా వుంది. ఆఫీసర్‌కి తాను ఎంత పని చేసినా సంతృప్తి ఉండదు. ప్రతిదానికీ వంక పెడతాడు. ఇప్పుడీ కుక్కపిల్లను అవతల పెట్టటం ఆయన చూశాడంటే ఇంక ఎప్పుడూ దెప్పి పొడుస్తూనేవుంటాడు! అనుకున్నాడు గామోలు ఆప్యూను అటు చూస్తూనే ముందుకు వెళ్ళిపోయాడు.

ఆకుక్కపిల్ల అక్కడేవుంది.

అది ఇప్పుడు నడిబజారులో వుంది.

కదలకుండా కూర్చుని వుంది.

ఆ బజారు పోయే చాలామంది పెద్ద మనుషులు దాన్ని చూస్తూపోతున్నారు. వాళ్ళంతా మనుషులే! వాళ్ళ సాటి వాళ్ళని ఎంత బాధపెట్టే వాళ్ళయినా, ఈ కుక్కపిల్లనుజూచి మాత్రం, పాపం, జాలిపడుతూనే ఉన్నారు. కాని ఎవ్వరూ దాన్ని తీసి అవతల పెట్టలేను.

వో బాబుల్లారా! అయ్యో పాపం! అది అక్కడే వుందే! చూస్తూనే వున్నారుగదా! ఏ క్షణంలోనైనా అది మట్టిలో కలిసి పోవచ్చు! వో జాలిగల తండ్రుల్లారా, తల్లుల్లారా! ఒక్క అడుగునేసి దాన్ని దీసి అవతలపెడితే మీ సొమ్మేంపోయింది!

అవును బాబూ! మీరు బడాబాబులు! పెద్ద మనుషులు! ఆహా! ఎంత పిరికి తనం పేరుకుపోయింది మీలో! సాటివాడిని చూస్తే ఎంత భయం మీకు!

ఆకుక్కపిల్ల అక్కడేవుంది.

వెనక కాలుతో తల గోక్కుంటోంది.

ఆ ఆనందాన్ని అనుభవిస్తూ కన్నులు మూసుకుని వుంది. వో పెద్దకారువస్తూంది. నల్లగా నిగనిగా మెరుస్తూ వస్తూంది. నిశ్శబ్దంగావస్తూంది మెత్తగా వస్తూంది!

ఆదారిన వో తల్లీకొడుకులు పోతున్నారు. ఇద్దరి నెత్తిమీద తట్టలు వున్నాయి. వారి బట్టలు మట్టి కొట్టుకుని వున్నాయి. వాళ్ళిద్దరూ మట్టిరంగులో వున్నారు. వాళ్ళు మట్టి పనికిపోయి వస్తున్నారు.

ఆమెకు నలభై యేళ్ళుంటాయి. మొగుడు చచ్చిపోయి చాలాకాలమయింది పాపం!

ఆ పిల్లాడికి పన్నెండేళ్ళుంటాయి.

ఆ తల్లీబిడ్డలు అలా బతుకుతున్నారు.

ఆరోజు పనికిపోయి ఆ రోడ్డువెంట వస్తున్నారు

ఆపిల్లాడు ఆ కుక్కపిల్లను చూశాడు వెనకనున్న కారును చూశాడు.

ఏమీ ఆలోచించలేదు.

పరుగెత్తుకుంటూ పోయాడు.

కారు మెత్తగా స్పీడుగా హుందాగా వస్తూంది.

పిల్లాడు కుక్కపిల్లను పట్టుకున్నాడు.

కారు వచ్చింది.

పోయింది.

పిల్లవాడు అక్కడే వున్నాడు—నెత్తురు మడుగులో.

కుక్కపిల్ల వుంది—వాడి క్రిందనేఉండి నాలిక వెళ్ళబెట్టి.

వాడు నవ్వుతున్నట్టున్నాడు.

కుక్కపిల్ల వెళ్ళబెట్టిన నాలిక లోకాన్ని వెక్కిరిస్తున్నట్లుంది.

ఆ పెద్ద కారు వో క్షణం ఆగింది! లోపల్నించి మంత్రిగారి తలకాయ విసుగ్గా బైటకు వెళ్ళుకొచ్చింది.

మరుక్షణంలోనే కారు బయలుదేరి పోయింది.

అక్కడేవున్న పోలీసు పలుకుబడి వున్న ఆ కారుని ఏమీ అనలేదు.

పిల్లాడి తల్లి తన దీనస్థితిని పెద్దగా ఏడుస్తూ వెళ్ళబెడుతూంది.

ఆమె ట్రాఫిక్‌కి అడ్డంగా వుంది.

పోలీస్ ఆమెను లాగి అవతల వేశాడు.

లోకం ఆగిపోలేదు.

వార్తాపత్రికలు ఈ వార్తను ప్రకటించలేదు.

ఆమె తన ఏడుపు ఆపలేదు.

ఆమెకు పిచ్చి పట్టిందని లోకం అను కుంటూంది.

ఆమె ఎప్పుడూ అక్కడే వుంటుంది.

అప్పుడప్పుడూ పిచ్చిపనులు చేస్తూం టుంది.

అక్కడున్న మట్టిని తనపై పోసు కుంటుంది. ●

